## క్లుప్తంగా

### గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాల కవాతు



వెదురుమూడిలో కవాతు చేస్తున్న సాయుధ బలగాలు

**కపిలేశ్వరపురం:** వెదురుమూడి, అచ్యుతాపురం, నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు మంగళవారం కవాతు చేశాయి. మండపేట రూరల్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వీధుల్లో సాయుధులు కవాతు చేస్తూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలన్న సందేశాన్నిచ్చారు. వెదురుమూడిలో నిర్వహించిన అవగాహన సమావేశంలో సీఐ శ్రీధర్, ఎస్సై అండె పరదేశీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో కవాతు నిర్వహించామన్నారు. జిల్లాలో అమలాపురం, కొత్తపేట, మండపేటకు 90 మంది చొప్పున సాయుధ దళాలు కేటాయించారన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసుకునే వాతావరణాన్ని కల్పించడమే సాయుధ బలగాల ప్రధాన లక్ష్యమన్నారు.

### ప్రజారోగ్య పరిరక్షణకే ఆరోగ్య సురక్ష



తిప్పరాజుపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు, నాయకులు

**కాజులూరు:** రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై సుప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పరాజుపాలెంలో అధికారులు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ యాళ్ళ మాణిక్యాంబ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని 352 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ మాట్లాడుతూ గ్రామాల్లో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సనందించటంతోపాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### సుర్రుమంటున్న సూరీడు



కె.గంగవరంలో మంగళవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

**కె.గంగవరం:** శివరాత్రి పర్వదినం అనంతరం నుంచి రోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరగడంతో వేడికి చిన్నారులు, వృద్ధుల పాటు సామాన్య ప్రజలు కూడా అపసోపాలు పడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్డు మీదకు రావాలంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సూర్యుడి ప్రతాపంతో పొలం పనులు చేసే కూలీలు, రైతులు సామాన్య ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో సూర్యుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎండ వేడిని భరించలేక ప్రయాణికులు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. కిళ్లీ షాపులు, జ్యూస్ సెంటర్లు జనంతో కిటకిటలాడుతున్నాయి. రెండు రోజులుగా రామచంద్రపురం నియోజకవర్గంలో 35 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు కావడంతో గ్రామాలు నిప్పుల కొలిమిలా ఉన్నాయి.

### పరీక్షకు 27 మంది గైర్హాజరు

**రంగంపేట:** మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. మూడు కేంద్రాల్లోనూ కలిపి మొత్తంగా 654 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 627 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

### వైభవంగా పెద్దింట్లమ్మ జాతర

**మామిడికుదురు:** గోగన్నమఠం గ్రామ శివారు తోట మెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవాన్ని ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. జాతర సందర్భంగా అమ్మ వారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఈ నెల 10 నుంచి అమ్మ వారి 55వ వార్షిక జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 8వ తేదీ వరకు అమ్మ వారి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

# సలహా మండళ్లతో సత్ఫలితాలు

- అన్నదాతలకు తోడ్పాటునిస్తున్న రైతు భరోసా కేంద్రాలు
- నూతన వ్యవస్థలతో క్షేత్రస్థాయిలో రైతు భాగస్వామ్యం
- రెండు నియోజకవర్గాల్లో ఆరు మండల సాగు సలహా మండళ్లు



కపిలేశ్వరపురం మండల సాగు సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న మండల చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి (ఫైల్)

**కపిలేశ్వరపురం:** రైతే రాజు అంటూ గత ప్రభుత్వం అన్నదాతను కీర్తించడానికే పరిమితమైంది. విత్తు నుంచి ఉత్పత్తుల విక్రయం వరకూ రైతులు గతంలో అనేక అష్టకష్టాలు పడేవారు. ఐదేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతలకు మేలు చేసే అనేక పథకాలు, వ్యవస్థీకృత మార్పులు చేయడంతో మెరుగైన ఫలితాలను సాగుదారులు పొందగలుగుతున్నారు. వ్యవసాయం శాస్త్రీయంగా, లాభసాటిగా సాగాలన్న సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుకు నూతన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. మండలానికి ఒక సాగు సలహా మండలిని ఏర్పాటు చేసి రైతుకు దన్నుగా నిలిపారు. ఆర్బీకే నుంచి రాష్ట్ర స్థాయి వరకూ వివిధ దశల్లో సాగు సలహా మండళ్లను ఏర్పాటు చేసి రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నిష్ణాతులైన రైతులు ఉన్నారు. క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ రైతు అభిప్రాయానికి విలువ ఏర్పడింది.

**సాగు సలహా మండళ్ల నిర్మాణం ఇలా...**

వైఎస్సార్ ఆర్బీకే, మండల, జిల్లా స్థాయిల్లో మూడు విభాగాలుగా ఏర్పాటైన సాగు సలహా మండళ్లలో వ్యవసాయ అనుబంధ సంస్థలన్నింటినీ ప్రభుత్వం ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చింది. ప్రతి నెలలో మొదటి శుక్రవారం ఆర్బీకే స్థాయి సలహా మండలి క్రమం తప్పకుండా సమావేశమై గ్రామంలోని రైతుల సమస్యలు, సూచనలను నేరుగా అధికారులు సేకరిస్తున్నారు. ఆయకట్టు రైతులు ఏమైనా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగానే అధికారులు క్షేత్ర పరిశీలనకు వెళ్తున్నారు.

**సమస్యల పరిష్కార వేదిక**

రైతుల ద్వారా వ్యక్తమైన అంశాలపై రెండో శుక్రవారం నిర్వహించే మండల స్థాయి సలహా మండలి సమావేశంలో చర్చిస్తున్నారు. మండల స్థాయి సాగు సలహా మండలిలో ఉన్న చైర్మన్, గౌరవ చైర్మన్ ఎమ్మెల్యే, ఏడుగురు సాగు అనుభవం గల రైతులు, ఎంపీడీఓ, వ్యవసాయ అనుబంధ రెవెన్యూ, ఇరిగేషన్, సహకార శాఖల అధికారులు చర్చలో పాల్గొంటున్నారు. సమస్యల పరిష్కారానికి సైతం ఉపకరిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలంలోని వల్లూరు, టేకి గ్రామాల్లో శివారు భూములకు నీరు సరఫరా సమస్య వచ్చినప్పుడు సలహా మండలిలో చర్చకు రావడంతో సమస్య పరిష్కారమైంది. మండల స్థాయి చర్చల్లో నిర్ధారణకు వచ్చిన అంశాలను, సమస్యలను, రైతుల విన్నపాలను మూడో శుక్రవారం నిర్వహించే అవిభక్త జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం దృష్టికి తీసుకెళ్తున్నారు.

**సాగుకు తోడ్పాటు**

జిల్లా సాగు సలహా మండలికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గౌరవ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. చైర్మన్‌తో పాటు 17 మంది రైతులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులున్నారు. క్షేత్ర స్థాయి నుంచి సేకరించిన అంశాలను జిల్లాలోని మంత్రుల ద్వారా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారమవడం ద్వారా సాగు రబీ ప్రక్రియ సజావుగా సాగేందుకు సాగు సలహా మండళ్లు తోడ్పాటునిస్తున్నాయి. విత్తన లభ్యత, పెట్టుబడి సాయం అందడంలో సాంకేతిక లోపాలు, వరిని ఆశించే తెగుళ్లు, సాగునీటి సరఫరా, ఎలుకల బెడద, గిట్టుబాటు ధర అమలు, యంత్ర పరికరాల మంజూరు ఇలా అనేక సమస్యలపై ఆయా స్థాయిల్లో చర్చ జరపడంతో సమస్యలు ప్రాథమిక స్థాయిలోనే పరిష్కారమవుతున్నాయి.

**రైతుకు గౌరవ స్థానం దక్కింది**



గత ప్రభుత్వాల హయాంలో రైతు మాటకు విలువ ఉండేది కాదు. సమస్య ఉంటే మండల కేంద్రంలో ఉండే వ్యవసాయాధికారి వద్దకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. గ్రామంలోనే ఆర్బీకేను ఏర్పాటు చేయడమూ, ఆర్బీకే స్థాయిలో రైతు కమిటీని వేయడం వల్ల పాలనలో రైతుకు స్థానం దక్కింది. రైతు మాట రాష్ట్ర స్థాయికి నివేదించే అవకాశం కలిగింది. ఇలా రైతుకు అన్ని విధాలా సాగు సలహా మండళ్లు దోహదపడుతున్నాయి.
– **మేడిశెట్టి దుర్గారావు**, మండల సాగు సలహా మండలి సభ్యుడు, టేకి

**రెండు నియోజకవర్గాల్లో సలహా మండళ్లు ఇలా..**

| మండలం | గ్రామాలు | సాగు విస్తీర్ణం | రైతులు | ఆర్‌బీకే కమిటీలు |
|---|---|---|---|---|
| రామచంద్రపురం | 25 | 18,806 | 9,737 | 21 |
| కె.గంగవరం | 26 | 15,633 | 8,700 | 23 |
| కాజులూరు | 26 | 19,382 | 17,200 | 23 |
| మండపేట | 12 | 16,985 | 11,042 | 22 |
| రాయవరం | 12 | 14,593 | 12,002 | 19 |
| కపిలేశ్వరపురం | 19 | 16,333 | 7,200 | 19 |
| మొత్తం | 120 | 1,01,732 | 65,881 | 127 |

### వైఎస్సార్ సీపీలో చేరిక



పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన దంగేరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు

**కె.గంగవరం:** దంగేరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. దంగేరు శివారు వాసాలరేవుకు చెందిన బైరామూర్తి, చెక్కా మహాలక్ష్మీ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన నాతి త్రిమూర్తులు, కోరుమిల్లి కృష్ణరాజు, ధర్మాడి శ్రీను, పంతాటి శ్రీనుతో పాటు వారి వర్గానికి చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సూర్యప్రకాష్ పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మంచి పరిపాలన చేస్తున్నారని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పాలనకు ఆకర్షితులమై చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని చేసేందుకు కృషి చేస్తామన్నారు.

### సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



**బిక్కవోలు:** మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో పాల్గుణ మాసం మంగళవారం కావడంతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన నిర్వహించారు.

# వైఎస్సార్ సీపీ పక్షాన ప్రజలు



డఫేదార్ సెంటర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

- మళ్లీ రాబోయేదీ జగనన్న సంక్షేమ పాలనే
- ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

**రామచంద్రపురం:** రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ పక్షాన ప్రజలు ఉన్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని డఫేదర్ సెంటర్ నుంచి ఇంటింటి ప్రచారాన్ని సూర్యప్రకాశ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల ద్వారా కుటుంబం పొందిన లబ్ధిని వారికి వివరించి, సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మళ్లీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ 50 శాతం ఎస్సీ బీసీ, మైనార్టీలకు టికెట్లు కేటాయించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని సూర్యప్రకాశ్ అన్నారు. అయిదేళ్ల కాలంలో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వారి అభివృద్ధికి పథకాలను అమలు చేశారన్నారు.తొలుత డఫేదర్ సెంటర్‌లోని గణపతి ఆలయంలో సూర్యప్రకాశ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇదే వార్డుకు చెందిన నేత పిట్టా నాని పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి నేతృత్వంలో పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ పార్టీ కండువాను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, పార్టీ కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, కేతాశ్రీను, బాసిన నాగమణి, బొక్కా సత్యనారాయణ, కట్టా శ్రీరాములు, కోటి శ్రీకన్యదుర్గాప్రసాద్, పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, బావాల భద్రరావు, పార్టీ నేతలు అకెళ్ల శర్మ, దత్తూ, బాసిన కిరణ్ సత్తి శంకర్‌రెడ్డి, బండి త్రిమూర్తులు, గుత్తుల వీరన్న శెట్టి, గృహసారథులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

**పేదల సంక్షేమం కోసం జగనే మళ్లీ సీఎం కావాలి**

**కాజులూరు:** రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కాజులూరు శివారు చాకిరేవుమెరకలో ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. గ్రామంలో అధిక సంఖ్యలో స్థానికులు మహిళలు సూర్యప్రకాశ్, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చింతలపాటి శ్రీనివాస్ తదితర నాయకులకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పేద మహిళలు, వృద్ధులను సూర్యప్రకాశ్ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చెయ్యాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దండంగి సరోజిని, పార్టీ నాయకులు టేకుమూడి శ్రీను, దంగేటి అరుణ్‌కుమార్, పితాని సుబ్రహ్మణ్యం, సత్తి శ్రీరామారెడ్డి, రెడ్డి నాగేశ్వరరావు, వెంకటరమణ, అప్పారావు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి జగన్ పాలనలోనే సాధ్యం



ఇప్పనపాడులో ప్రజలకు పథకాలను వివరించి బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**మండపేట:** గ్రామాల అభివృద్ధి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ఇప్పనపాడులో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయనకు గ్రామ ఎంపీటీసీ వనుం సత్యవేణి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకులు కురుపూడి రాంబాబు, సిరిపురపు శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వనుం నారాయణ, పెదపాటి సత్యనారాయణమూర్తి, గారపాటి అశోక్ కుమార్, జిన్నూరి సాయిబాబా, నాగిరెడ్డి రాంబాబు, దాసరి లాజరు, పలివెల సుధాకర్, పిల్లా సూరిబాబు, అన్నందేవుల కృష్ణారావు, త్రిశూల శ్రీను, చిన్ని గంగాధరం, త్రిశూల అప్పారావు, చింతలపూడి మల్లిబాబు, గ్రంధి సూరిపండు, పంపన పద్మారావు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ తోటకు ఎస్ఐఓ మ్యానిఫెస్టో అందజేత**

పట్టణంలోని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) నాయకులు మంగళవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు తమ సంఘం రూపొందించిన మ్యానిఫెస్టోను అందజేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బాని, రాష్ట్ర షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ గౌస్‌తో కలిసి ఎమ్మెల్సీ తోటతో పలు అంశాలపై చర్చించారు. ఎస్ఐఓ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ హఫీజ్ ఎమ్మెల్సీ తోట దృష్టికి మ్యానిఫెస్టోలోని అంశాలను తీసుకొచ్చారు. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఎస్ఐఓ ప్రత్యేకమైన మ్యానిఫెస్టోను రూపొందించామని, దేశ వ్యాప్త వ్యవహారాలకు సంబంధించి 10 డిమాండ్లు, రాష్ట్ర పరిధికి సంబంధించి 13 డిమాండ్లను మ్యానిఫెస్టోలో పొందుపర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ జిల్లా నాయకులు వసీం, మండపేట శాఖ అధ్యక్షుడు రషీద్, కార్యదర్శి అతీక్, సభ్యులు మాజ్, రహమతుల్లా, సుహేబ్, షేక్ సర్కార్, షేక్ అన్సారీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భక్తాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు**

కేశవరంలో భక్తాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యురాలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ (సత్తిబాబు), ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీను ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం పలికారు. భక్తులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. నాయకులు సలాది శివ, కొప్పిరెడ్డి ప్రసాద్, పెదపాటి ఉమామహేశ్వరరావు, తుపాకుల ప్రసన్నకుమార్, కూసు దొరాజీ, అల్లంపల్లి కిశోర్, అద్దంకి రమణ పాల్గొన్నారు.

# ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏవో ప్రభాకర్

**రాయవరం:** రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్, తహసీల్దారు ఆర్వీ కృష్ణారావు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు, పీఏసీఎస్ సెక్రటరీలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ప్రభాకర్, కృష్ణారావు మాట్లాడుతూ మద్దతు పొందాలంటే ధాన్యంలో తేమ 17శాతం లోపు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో 14,447 ఎకరాల్లో రబీ వరి సాగు చేపట్టగా, 55వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. తహసీల్దారు కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర సాధారణ రకానికి 75 కేజీలు బస్తాకు రూ.1,637, ఏ గ్రేడ్ రకానికి రూ.1,652 కొనుగోలు కేంద్రాల్లో లభిస్తుందన్నారు. త్వరలోనే మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అనుసరించాల్సిన నిబంధనలు వివరించారు. వ్యవసాయ సహాయకులు ఆర్‌బీకేల పరిధిలోని రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులను ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక్కొక్కరిని కస్టోరియన్ ఆఫీసర్స్‌గా నియమిస్తామన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు ముందుగానే ఏర్పాటు చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు, పీఏసీఎస్ సెక్రటరీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ డీటీ ఎలీషా, డిప్యూటీ తహసీల్దార్ జానకిరామయ్య పాల్గొన్నారు.

# శాంతియుత ఎన్నికలకు సహకరించాలి



రామచంద్రపురంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామచంద్రమూర్తి

**రామచంద్రపురం రూరల్:** రాజకీయ పార్టీలు రానున్న సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించాలని రామచంద్రపురం ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి, ఎన్నికల ఖర్చుల ఆడిటర్ జె. అప్పారావు కోరారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు మంగళవారం రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. పౌరులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఏవైనా సంఘటనలు గుర్తిస్తే సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదును నమోదు చేయాలన్నారు. సీ విజిల్ యాప్‌లో సాక్ష్యాలతో సహా పొందుపర్చవచ్చని, ఫొటో, వీడియో, ఆడియోల రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లోనే ఖచ్చితమైన చర్యలు తీసుకుంటామన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నంబరు ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ప్రధాన ప్రదేశాల్లో ప్రచారం నిమిత్తం ఫ్లెక్సీల ఏర్పాటుకు, వాహనాల వినియోగానికి తప్పని సరిగా ఆర్వో అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి పత్రం లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ర్యాలీలో పాల్గొనే వాహనాలు, ద్విచక్ర వాహనాలు అన్నింటికీ ముందస్తు అనుమతి పొందాలన్నారు. వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే నియమావళి ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. పబ్లిక్ సమావేశాలు, రోడ్డు షోలకు ఆర్వో, పోలీస్ శాఖల ముందస్తు అనుమతి ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధిగా మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, జనసేన నుంచి ఎస్ శ్రీహరిపంతులు, బీఎస్పీ నుంచి ఎం. సుబ్రహ్మణ్యం, మండల ప్రజాపరిషత్ ఏఓ చాగంటి అచ్యుత రామ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ ఎన్. సెలత్‌రాజు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ విగ్రహ ప్రతిష్ఠ

**మామిడికుదురు:** పెదపట్నంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర, ఆంజనేయస్వామి వార్ల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, ప్రధాన మండపారాధన, అంకురారోహణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమాలను వేద పండితులు వైభవంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. 28వ తేదీ గురువారం ఉదయం 9.36 గంటలకు స్వాతీ నక్షత్రయుక్త వృషభ లగ్నంలో విఘ్నేశ్వర ప్రయుక్త సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

### ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

**మండపేట:** సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఏ స్థాయిలోనైనా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన రౌడీషీటర్లను రామచంద్రపురం డీఎస్పీ డి.రామకృష్ణ హెచ్చరించారు. మండపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలోనూ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు డీఎస్పీ రామకృష్ణ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తితే అవసరమైన మేరకు బైండోవర్ చేయమని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ షేక్ అఖిల్‌జమ, మండపేట పట్టణ ఎస్సై హరికోటి శాస్త్రి, అదనపు ఎస్సై నాంచారయ్య పాల్గొన్నారు.

### ఫ్లయింగ్ స్క్వాడ్ వాహన తనిఖీలు



చింతపల్లి లాకుల వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధులు

**పెదపూడి:** మండలంలోని చింతపల్లి, జి.మామిడాడ, కాండ్రేగుల, రామేశ్వరం గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మంగళవారం విస్తతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారి ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని, రశీదులు లేని, ఆధారాలు లేని వస్తువులు, నగదు తరలిస్తే వాటిని నిబంధనల ప్రకారం సీజ్ చేస్తామన్నారు. అనంతరం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేసి జిల్లా కలెక్టర్ వారి గ్రీవెన్స్‌కు పంపిస్తామన్నారు.

**గ్రామ పంచాయతీ కార్యాలయం, ద్వారపూడి**

**బహిరంగ వేలము నోటీసు**

ఆ.క.నెం.128/2023 తేది 26-03-2024

మండపేట మండలంలోని ద్వారపూడి గ్రామ పంచాయతీ ఏరియాలో యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆయిటంలకు ఫీజులు వసూలు చేసి అనుభవించు హక్కునకు ది.28-03-2024 వ తేదీ గురువారం మధ్యాహ్నం గం. 3-00 ల నుండి ద్వారపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము జరుపబడును.

| వ.నెం. | వేలం వివరం | వేలం అనుభవించు కాలం | వేలం ధరావత్తు |
|---|---|---|---|
| 1 | పశువుల సంతలో పశువులపై ఫీజులు వసూలు చేసుకొనే హక్కు | 2024-25 (1-04-24 To 31-3-25) | 5000/- |
| 2 | పశువుల సంతలో దుకాణంలపై ఫీజులు వసూలు చేసుకొనే హక్కు | " | 500/- |
| 3 | పశువుల సంతలో పశువులను లారీలపై లోడింగు చేయు ర్యాంపుపై ఫీజులు వసూలు చేసుకొనే హక్కు | " | 5000/- |
| 4 | కాయగూరల మార్కెట్టులోని దుకాణంలపై మరియు గ్రామములో పబ్లిక్ స్థలములలో మరియు తిరుగాడు వివిధ వ్యాపారములపై రోజు వారి ఫీజులు చేసుకొనే హక్కు | " | 5000/- |
| 5 | అపరాల మార్కెట్టులో దుకాణంలపై ఫీజులు వసూలు చేసుకొనే హక్కు | " | 500/- |
| 6 | కోళ్ళ మార్కెట్టులో దుకాణంలపై ఫీజులు వసూలు చేసుకొనే హక్కు | " | 500/- |
| 7 | చేపల మార్కెట్టులో దుకాణంలపై ఫీజులు వసూలు చేసుకొనే హక్కు | " | 500/- |
| 8 | జంతువధ శాలలో ఫీజులు వసూలు చేసుకొనే హక్కు. | " | 500/- |
| | **చిల్లర వేలములు** | | |
| 1 | పాడైన కుర్చీలు, బల్లలు, బీరువాలు వగైరా వేలం | 2023-24 (1-04-24 To 31-3-24) | 250/- |
| | **2022-23 సంవత్సరమునకు గాను గ్రామపంచాయితీకు సంబంధించి వివిధ సేవల టెండర్లు** | | |
| 1 | గ్రామపంచాయితీనకు మంచినీటి విడిభాగాలు సరఫరా | 2024-25 (1-04-24 To 31-3-25) | 1000/- |
| 2 | గ్రామపంచాయితీనకు గాను ప్రజారోగ్య విడిభాగాలు సరఫరా చేయుట | " | 500/- |
| 3 | గ్రామపంచాయితీనకు గాను ప్రజారోగ్య సిబ్బందికి సబ్బులు, కొబ్బరినూనె మరియు పండుగ బట్టలు, చెప్పులు వగైరా సరఫరా | " | 500/- |

గ్రామపంచాయితీనకు బకాయి వున్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు.

సదరు వేలంలో పాల్గొనదలచినవారు నిర్ణీత డిపాజిట్టు చెల్లించి వేలము షరతులకు లోబడి పాటలో పాల్గొనవలయును. షెడ్యూల్డు దాఖలా 1, 3 అయిటంలకు పాటలో పాల్గొనదలచిన వారు రూ.50000/-లకు 4,5 అయిటంలకు పాటలో పాల్గొనదలచినవారు రూ.25000/- లకు మోతుబరీ ధృవీకరణపత్రము వ్యవసాయ భూములకు రెవిన్యూ అధికారుల నుండి భవనంలకు పంచాయతీ అధికారులు నుండి పొంది పాటముందు గా దాఖలు పరచవలెను. షెడ్యూల్డు దాఖలా అన్ని వేలంలకు పాట సొమ్ము మొత్తం పాట ఖాయపరిచిన అనంతరం ఏక మొత్తంలో చెల్లించి సక్రమమైన రశీదు పొందవలయును. వేలం నందు స్వయంగా పాల్గొనవలయును. లేని యెడల ఎవరి పేరనైనా పాడదలచినవారు పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్టరు చేయించి దాఖలు చేసి పాటలో పాల్గొనవలయును. వేలములు శ్రీ డివిజనల్ పంచాయతీ అధికారి వారి కనిష్ఠ ధరలకు లోబడి వేలములు జరుపబడును. వేలములు వాయిదా వేయుటకు, నిలుపుదల చేయుటకు వేలము వేయు అధికారికి అధికారము కలదు. యితర వివరములు మిగిలిన వేలము షరతులు కార్యాలయపు పనివేళలలో అడిగి తెలుసుకొనవలయును.

సం/- **ఉంతకోట కిన్నెర** సర్పంచ్, ద్వారపూడి